సాక్షి
అనకాపల్లి
బుధవారం । 30 । ఏప్రిల్ । 2025

అధికార పార్టీ నేతలకే అంతరాలయ దర్శనం!

సామాన్య భక్తులకు అల్లంతదూరం


టికెట్లు, కారు పాసుల కోసం భక్తుల అగచాట్లు

- రూ.1,000 టికెట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి అంతే..
- రూ.1,500 టికెట్లన్నీ కూటమి పార్టీల నేతలకే..
- టికెట్ల జారీలో దేవాలయ ఈవోకి దక్కని స్థానం
- కలెక్టరేట్, అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకే వ్యవహారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

సాధారణ భక్తులకే అప్పన్న చందనోత్సవంలో పెద్ద పీట వేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన జిల్లా యంత్రాంగం.. కేవలం వీఐపీ భక్తుల సేవలోనే తరిస్తోంది. అధికార పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు వారి అనుచరులకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పించేందుకు సిద్ధమైంది. సాధారణ భక్తులు, ఆన్‌లైన్‌లో రూ.1,000 టికెట్లను కొనుగోలు చేసిన వారికి మాత్రం అంతరాలయ దర్శనం లభించడం లేదు. కేవలం సిఫార్సులకే పెద్ద పీట వేయడం, సాధారణ భక్తులకు అంతరాలయ దర్శనం లేకపోవడం వంటి వ్యవహారాలన్నీ.. దేవాలయ ఇన్‌చార్జి ఈవోని డమ్మీని చేసి కలెక్టరేట్ నుంచి నడిచాయని విమర్శలు వినిపిస్తున్నాయి. టికెట్ల జారీలో కానీ, ఏర్పాట్లలో కానీ ఈవోతో సంబంధం లేకుండా వ్యవహారాలు సాగాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. మొత్తంగా ఎన్నడూ లేని విధంగా వీఐపీ భక్తులకే అంతరాలయం ద్వారా నిజరూప అప్పన్న దర్శనం లభించనుండగా.. సాధారణ భక్తులు మాత్రం దూరం నుంచే హడావుడిగా దర్శనం చేసుకుని ముందుకు సాగాల్సిన పరిస్థితులు ఉన్నాయనే అభిప్రాయం భక్తుల్లో వ్యక్తమవుతోంది.

సిఫార్సులకే పెద్ద పీట

ఏడాదిలో ఒక్కరోజే లభించే అప్పన్న నిజరూప దర్శనం కోసం ఉత్తరాంధ్రతో పాటు ఉభయ గోదావరి, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. ఈసారి 2 లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా వేశారు. అయితే టికెట్లు మాత్రం సాధారణ భక్తులకు అందుబాటులో లేకుండా పోయాయనే విమర్శలున్నాయి. ఆన్‌లైన్ టికెట్లను కూడా ముందుగానే అధికార పార్టీ నేతలకు అప్పగించారనే ఆరోపణలున్నాయి. ఇక వీఐపీ టికెట్లతో పాటు రూ.2,500, రూ.1,500, రూ.1000 టికెట్ల జారీలోనూ కేవలం అధికార పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలకే పెద్ద పీట వేశారనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీ నేతలు కోరినన్ని టికెట్లు జారీ చేసిన జిల్లా యంత్రాంగం.. దేవాలయంలో నిరంతరంగా సేవలందించే వ్యక్తులు, సంస్థలు పది టికెట్లు అడిగితే కేవలం ఒకటి మాత్రమే ఇచ్చేందుకు అంగీకరించారు. తీరా ఈ టికెట్లను తీసుకునేందుకు సదరు బ్యాంకు వద్దకు వెళితే.. తమకు ఇంకా దేవస్థానం నుంచి లేఖ రాలేదనే సమాధానం వస్తోంది. ఈ నేపథ్యంలో దేవస్థాన అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించిన వ్యక్తులు, సంస్థలకు కూడా కనీస గౌరవ లేకుండా చేశారని వాపోతున్నారు. మొత్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారుల వ్యవహారం ఉందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

డమ్మీగా మారిన ఈవో..!


ఈవో కార్యాలయం వద్ద పడిగాపులు

ప్రస్తుత సింహాచలం దేవస్థానం ఈవో సెలవులో ఉండడంతో ఇన్‌చార్జిగా ఈవోగా కె.సుబ్బారావును ప్రభుత్వం నియమించింది. అయితే, సదరు దేవాలయ ఈవోను చందనోత్సవ వ్యవహారాల్లో నామమాత్రం చేశారనే విమర్శలున్నాయి. పాసుల జారీలో కానీ.. నిర్ణయాల్లో కానీ దేవాలయ ఈవోను డమ్మీ చేశారనే ఆరోపణలున్నాయి. పెత్తనమంతా రెవెన్యూ యంత్రాంగానిదే ఉంటోందని దేవదాయ అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. దేవాలయంలో నిరంతరంగా సేవలందించే వ్యక్తులు, సంస్థలతో పాటు ఎన్‌జీవోలకు కూడా టికెట్లను మంజూరు చేయాలంటే కలెక్టరేట్ నుంచి ఆదేశాలు రావాల్సిందేనని దేవాలయ అధికారులు చేతులెత్తేసినట్టు తెలుస్తోంది. కనీసం వీరికి కూడా పాసులు ఇచ్చేందుకు తమ చేతుల్లో ఏమీ లేదని దేవాలయ అధికారులు పేర్కొంటున్నట్టు సమాచారం. కలెక్టరేట్‌కు వెళితే కనీసం ఎవరూ తమను పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఇన్‌చార్జిగా ఉన్న ఈవో మరో వారం, పది రోజుల్లో వెళ్లిపోయే భావనలో ఉండటంతో.. ఆయన్ని పూర్తిగా విస్మరించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా దేవాలయ అధికారులను, సిబ్బందిని నామమాత్రం చేసి అంతా కలెక్టరేట్ నుంచి, అధికార పార్టీ నేతల నుంచి వచ్చే ఆదేశాలే అమలవుతున్నాయనే విమర్శలు సింహాచలం కొండల చుట్టూ ప్రతిధ్వనిస్తుండటం గమనార్హం.



నిజరూప దర్శనానికి వేళాయె

- నేడు స్వామి వారి చందనోత్సవం
- ఉదయం 3.30 గంటల నుంచి సర్వ దర్శనాలు
- రాత్రి 7 గంటలకు క్యూలు మూసివేత

సింహాచలం:

సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వేళయింది. ఏడాది పొడవునా చందనం పూతతో దర్శనమిచ్చే స్వామిని, నిజరూపంలో దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. బుధవారం వేకువజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారిపై ఉన్న చందనాన్ని ఒలిచి, నిజరూప భరితుడిని చేస్తారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పించి, వేకువజాము 3.30 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పించనున్నారు. రాత్రి 9 గంటల నుంచి స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తారు. విశేషపూజల అనంతరం స్వామికి తొలివిడతగా మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) చందనాన్ని సమర్పిస్తారు.

పటిష్ట ఏర్పాట్లు : చందనోత్సవానికి ఈ సారి రెండు లక్షల మంది భక్తులు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1,000, రూ.1500ల దర్శనం టికెట్ల క్యూలు ఏర్పాటు చేశారు. వారికి కేటాయించిన స్లాట్ల ప్రకారం దర్శనాలకు అనుమతిస్తారు. రాత్రి 7 గంటలలోపు మాత్రమే సింహగిరిపై దర్శనాల క్యూల్లోకి భక్తులను అనుమతిస్తారు. అనంతరం క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి, అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6 గంటల వరకు సింహగిరిపైకి బస్సుల్లో భక్తులను అనుమతిస్తారు. చందనోత్సవం సందర్భంగా అన్ని శాఖల సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.


చందనంలో సుగంధ ద్రవ్యాలు కలుపుతున్న అర్చకులు

చందనంలో సుగంధ ద్రవ్యాల మేళవింపు

చందనోత్సవం అనంతరం బుధవారం రాత్రి స్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనంలో దేవస్థానం అర్చకులు మంగళవారం పలురకాల సుగంధ ద్రవ్యాలను కలిపారు. సహస్ర ఘటాభిషేకానికి వెండి, మట్టి కలశాలను సిద్ధంచేశారు.


అలంకరణలో గుడి ఆవరణ

వైఎస్ జగన్‌ను కలిసిన అమర్‌నాథ్


మాజీ ముఖ్యమంత్రిని కలిసిన వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

సీతమ్మధార : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కలిశారు. అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులతో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొన్నారు. అనంతరం అధినేతను ప్రత్యేకంగా కలిసి పార్టీ జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్తగా కరణం ధర్మశ్రీ



ఏయూక్యాంపస్: వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలిగా శోభా హైమావతి



ఏయూక్యాంపస్: వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలిగా మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అరకు పార్లమెంట్ పరిశీలకుడిగా బొడ్డేడ ప్రసాద్, కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడిగా మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు నియమితులయ్యారు. వీరు పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్లకు అనుసంధానంగా పనిచేస్తారు.

టీడీపీకి షాక్

- వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరేళ్ల తర్వాత అడ్డగోలు కేసు
- రిమాండ్‌ను తిరస్కరించిన కోర్టు
- స్టేషన్ బెయిల్ మంజూరు

నర్సీపట్నం/నక్కపల్లి/అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకుల రిమాండ్‌ను అనకాపల్లి కోర్టు తిరస్కరించడంతో టీడీపీకి షాక్ తగలింది. ఆరేళ్ల క్రితం జరిగిన ఘటనపై మాకవరపాలెం మండలం మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సర్పంచ్‌లు బొడ్డు గోవిందరావు, మాకిరెడ్డి అయ్యప్పతో పాటు పార్టీ నేత బండారు గాంధీలపై పోలీసులు పెట్టిన కేసులో న్యాయస్థానంలో ఊరట లభించింది. మాకవరపాలెం పోలీసులు ఈ నెల 28వ తేదీ అర్ధరాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి స్టేషన్‌కు తరలించారు. పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్టేషన్‌కు వచ్చే అవకాశం ఉండడంతో అరెస్టు చేసిన నాయకులను అడ్డురోడ్డు పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ నుంచి అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో వైఎస్సార్ సీపీ నాయకులను హాజరుపరిచారు. మాకవరపాలెం మండలంలోని జి.వెంకటాపురం గ్రామానికి చెందిన చొప్పా లక్ష్మణ్ 2019 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీనికి సంబంధించి అప్పట్లో ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. దీంతో వైఎస్సార్‌సీపీ నేతలు లక్ష్మణ్‌ను మందలించి సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేకు క్షమాపణలు చెప్పించారు. ఆరేళ్ల క్రితం లక్ష్మణ్‌ను మందలించిన వీడియో ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఈ ఘటనతో సంబంధం ఉందంటూ నలుగురు వైఎస్సార్‌సీపీ నేతలను అరెస్టు చేశారు. న్యాయస్థానంలో వీరిని హాజరు పరచగా.. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి రిమాండ్‌ను తిరస్కరించారు. అరెస్ట్ చేసిన వైఎస్సార్‌సీపీ నేతలకు 41 నోటీసు ఇచ్చి విడుదల చేయాలని పోలీసులను ఆదేశించారు. న్యాయస్థానం ఆదేశాలతో టీడీపీకి, పోలీసులకు ఊహించని షాక్ తగిలిందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. టీడీపీ నాయకులు రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పార్టీ నేతలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. న్యాయస్థానాలు కూటమి నేతలకు చీవాట్లు పెట్టినా వారిలో పరివర్తన రాలేదన్నారు. ఎన్ని కేసులు పెట్టిన న్యాయస్థానాల ద్వారా ఎదుర్కొంటామని, ధర్మమే గెలుస్తుందన్నారు. న్యాయస్థానాలపై తమకు గౌరవం ఉందన్నారు. అంతకుముందు అడ్డు రోడ్డు స్టేషన్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను గణేష్ పరామర్శించారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిని టీడీపీ కార్యకర్త నోటికి వచ్చినట్లు రాయడానికి, చెప్పడానికి వీలులేని పదజాలంతో బూతులు తిడితే మందలించడం తప్పా, ఇదెక్కడి న్యాయం చంద్రబాబు, లోకేష్‌లను తిడితే ఊరుకుంటున్నారా.. అని కూటమి ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. చంద్రబాబుకు, లోకేష్‌లకు ఒక న్యాయం జగన్‌మోహన్‌రెడ్డికి మరో న్యాయమా అంటూ నిలదీశారు.

పేదరిక నిర్మూలనలో మార్గదర్శులను గుర్తించండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: పేదరిక నిర్మూలనకు మార్గదర్శులను గుర్తించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'పేదరిక నిర్మూలన–మార్గదర్శి–బంగారు కుటుంబం పీ 4 జీరో పావర్టీ' కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. అట్టడుగు వర్గంలో ఉన్న 20 శాతం కుటుంబాలను ఆదుకోవడం కోసం పీ 4 సర్వే ద్వారా సమాజంలో సేవా దృక్పథం కలిగిన మార్గదర్శులను గుర్తించాలన్నారు. జిల్లాలో 64,475 బంగారు కుటుంబాలను పీ 4 సర్వే ద్వారా గుర్తించామని, ఈ కుటుంబాలకు ఉన్నత స్థాయిలో ఉన్న వివిధ వర్గాల నుంచి మార్గదర్శులను ఎంచుకుని, ఈ మార్గదర్శులను బంగారు కుటుంబంతో అనుసంధానం చెయ్యాలన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి కృషి

పశుసంవర్ధక శాఖ పనితీరు, పురోగతిపై నిర్వహించిన త్రైమాసిక సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పశు వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పాడి రైతుల అభివృద్ధికి దోహదపడే పథకాలను ప్రజలకు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న రైతుల్లో చాలామంది ఒక పశువుతో జీవనం సాగిస్తున్నారని వారి జీవన నైపుణ్యం పెంచేందుకు వెలుగు ద్వారా రెండో పశువును అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ పురోగతి, పనితీరు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గర్భిణులను ముందుగా గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తం చేయాలన్నారు.

క్లుప్తంగా

డీఈవోకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సత్కారం



జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడును సత్కరిస్తున్న నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్ : జిల్లా పరిధిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ, ఉత్తమ ఫలితాల సాధనకు విశేష కృషి చేసిన జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడును నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం సత్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ త్వరిత గతిన 10వ తరగతి సిలబస్ పూర్తి చేయించడంలోనూ, నిర్వహించడంలోనూ ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణంరాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనుబాబు పాల్గొన్నారు.

పంట కోతలు వాయిదా వేసుకోవాలి



శాస్త్రవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఏడీఆర్ రమణమూర్తి

అనకాపల్లి : గాలులు, వర్ష సూచన ఉన్నందున, కోత దశలో ఉన్న వరి, వేరుశనగ, నువ్వుల పైరులను కోయడం వాయిదా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌ఛార్జ్ ఏడీఆర్ డాక్టర్ కె.వి.రమణమూర్తి అన్నారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పీకపురుగు ఆశించవచ్చని, నివారణకు క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మీ.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. చెరకులో రాగల వర్షాన్ని వినియోగించుకుని పై పాటు ఎరువును అనగా 45 రోజుల వయసు గల కార్శి చేసిన పైరులో ఎకరాకు 150 కిలోల యూరియాను 90 రోజుల వయసు గల చెరకు మొక్క తోటల్లో 75 కిలోల యూరియాను పై పాటుగా వేసుకోవాలని అన్నారు. పక్వానికి వచ్చిన అరటి గెలలను, మామిడి, బొప్పాయి వంటి పండ్లను, కూరగాయలను వెంటనే కోసి మార్కెట్‌కు తరలించాలని సూచించారు. అలాగే పక్వానికి వచ్చిన మిరప కాయలను వెంటనే కోసుకోవాలని సూచించారు. ఖాళీగా ఉన్న పొలాల్లో వేసవి లోతు దుక్కు చేసుకునే తరుణం ఇదేనని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బి.భవాని, ఎ.శిరీష, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

పద్యమేవ జయతే..

- తెలుగు ఉపాధ్యాయుల కృషి
- మాతృభాషపై విద్యార్థులకు మమకారం పెరిగేలా కార్యక్రమాలు
- అనంతచ్ఛందం సహకారంతో తర్ఫీదు
- గూగుల్ లింక్ ద్వారా పద్య పోటీలు
- విజేతలకు ప్రశంసాపత్రాలు



గత నెల నిర్వహించిన పద్య పఠన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



పద్యపఠనంలో ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న తోపెల్ల సుబ్రహ్మణ్యశర్మ తదితరులు



పద్యపఠనంపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు ఆచార్యులు

నక్కపల్లి : శాఖోపశాఖలుగా వికాసం పొందిన కావ్య ప్రక్రియలలో శతక ప్రక్రియ ఒకటి. ప్రాకృత, సంస్కృత ప్రక్రియలను అనుసరించి తెలుగు శతక రచన ఆరంభమై కాలక్రమేణ విశిష్ట సాహితీ ప్రక్రియగా రూపొందింది. ప్రాచీన కాలం నుంచి కనీవినీ ఎరుగని ఎన్నో శతక రచనలు విశిష్టమైన కవుల వివరాలు సేకరించి విద్యార్థులకు పరిచయం చేసి వారిలో పద్యపఠనం పట్ల ఆసక్తి కల్పిస్తోంది అనంతచ్ఛందం అనే సంస్థ. శతక పద్య పఠనంపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తూ వారిలో ఆసక్తి పెంచుతూ బోధన చేస్తున్నారు బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు. ఇటీవల ఉపమాకలో శతక పద్యాలపై అష్టావధానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులను తీసుకెళ్లి ముఖ్య అతిథులుగా హాజరైన అష్టావధానుల్లో ఎంతో మంది నిష్ణాతులకు పరిచయం చేసి వారి సందేహాలను నివృత్తం చేయడమే కాకుండా పద్యపఠనంపై వారిలో మరింత ఆసక్తి పెరిగేలా కృషి చేశారు. ఇదే కార్యక్రమంలో పద్యపఠనంపై ప్రముఖ కవులు, అష్టావధానుల సమక్షంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆన్‌లైన్ పద్య పోటీలు

పద్య రచనలు చేయడంలో అనంతచ్ఛందం, మహతి చానల్ వారి సహకారంతో పాఠశాలల్లో విద్యార్థులకు తర్ఫీదు నిస్తున్నారు. అనంతచ్ఛందం వారి సహకారంతో పద్యగురు తోపెల్ల బాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ప్రతి నెలా నాలుగో ఆదివారం గూగుల్ లింక్ ద్వారా ఆన్‌లైన్ పద్య పోటీలను నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు చిన్న వయసులోనే పద్య పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు మాతృభాషపై మమకారం పెంచేలా తెలుగు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గూగుల్ లింక్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు స్థానిక విద్యార్థులతోపాటు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన తెలుగువారు, తెలుగు భాషపై మమకారం ఉన్న వారు పాల్గొనడం విశేషం .పద్యపోటీల్లో విజేతలకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు సైతం అందజేస్తున్నారు.

పెదబోదిగల్లం జెడ్పీపాఠశాలలో...

ఆరు మాసాలుగా పెద బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.వి.ఎస్. ఆచార్యులు ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పద్య పఠనం, పద్య రచనపై మంచి తర్ఫీదునిస్తూ పోటీల్లో పాల్గొనేలా చేస్తున్నారు. రోజూ పాఠశాలలో కొంత సమయాన్ని వీరి కోసం కేటాయించడం గమనార్హం. పద్య పఠనంతో విద్యార్థుల్లో ధారణ శక్తి పెంపొందడమే కాకుండా మానసిక వికాసం, భాషపై పట్టు సాధించడానికి వీలు కలుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పద్య పఠనంలో శిక్షణ



విద్యార్థులు కేవలం తరగతిలో పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సహ పాఠ్య కార్యక్రమాలపై దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటున్నాం. చదువు, ఆట పాటలకే పరిమితం కాకూడదనే ఉద్దేశంతో పద్యపఠనం, పద్యరచన వంటి కార్యక్రమాల్లో తర్ఫీదునిస్తున్నాం. అనంతచ్ఛందం, మహతి చానల్ వారి సహకారం సంపూర్ణంగా ఉంది. గూగుల్ లింక్ ద్వారా మా విద్యార్థులు ప్రతి నెలా పాల్గొని పద్యాలు చదవడం ఆనందంగా ఉంది.

–సిహెచ్ సత్యనారాయణ, హెచ్‌ఎం పెదబోదిగల్లం

విశేష స్పందన



ఆరు నెలల నుంచి చిన్నారులను పద్య పఠనంపై శిక్షణ ఇచ్చి పోటీల్లో పాల్గొనేలా చేస్తున్నాం. ఈ పద్య పఠనం పోటీల్లో ఇప్పుడు మా పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. రోజూ కొంత సమయాన్ని కేటాయించి పద్యాలను రాగ, భావయుక్తంగా చదివేలా శిక్షణ ఇవ్వడం జరిగింది. తల్లిదండ్రులనుంచి కూడా విశేష స్పందన లభిస్తోంది.

–ఎస్.వి.ఎస్ ఆచార్యులు, తెలుగు ఉపాధ్యాయుడు

పోటీల్లో పాల్గొంటున్నా...



ప్రతి నెలా నాలుగో ఆదివారం నిర్వహించే పద్యపఠనం పోటీల కోసం ఎదురు చూస్తాం. మా తెలుగు మాస్టారు పర్యవేక్షణలో కొంత సమయం కేటాయించి పద్యపఠనం, పద్యరచనలో తర్ఫీదు పొందుతున్నాను. ఇప్పుడిప్పుడే రాగ, భావయుక్తంగా పద్యాలు చదవడం నేర్చుకుంటున్నాను. ఆరు నెలల నుంచి అనంతచ్ఛందం సమూహంలో సభ్యురాలిగా ఉన్నాను. పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు పొందాను.

–పి.ఉదయలక్ష్మి, విద్యార్థిని, బోదిగల్లం

ఎంతో ఆసక్తిదాయకం



ప్రతి నెలా వివిధ శతకాలలో ఉన్న కఠినమైన పద్యాలను చదవడం వల్ల తెలుగు వాచకంలో ఉన్న పద్యాలను అవలీలగా చదవగలుగుతున్నాను. నాకు పద్యపఠన పోటీల్లో పాల్గొనడం వల్ల మాతృభాషపై ఆసక్తి పెరిగింది. నేను చాలా సార్లు అనంతచ్ఛందం మహతి చానల్ వారు నిర్వహించే పద్యపఠన పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు పొందాను.

–యాదాల చరణ్, విద్యార్థి, బోదిగల్లం

నేరేడు బందలో ఆరుగురికి మలేరియా జ్వరాలు



జ్వర పీడితులకు ఆర్టీడీ టెస్టులు చేస్తున్న మలేరియా అధికారులు

రావికమతం : చీమలపాడు శివారు కొండ శిఖర గ్రామం నేరేడుబందలో ఆరుగురికి మలేరియా జ్వరాలు ఉన్నట్టు ఆర్టీడీ టెస్టులు (రక్త పరీక్షలు) ద్వారా మలేరియా అధికారులు నిర్ధారించారు. నేరేడుబందలో విష జ్వరాలు ప్రబలి 13 మందికి పైగా మంచం పట్టారు. విష జ్వరాలపై మంగళవారం సబ్ యూనిట్ మలేరియా అధికారి రమణ, ఎల్.టి. మహేష్ , హెచ్.ఎస్.రమణ నేరేడుబందకు వెళ్లి జ్వరాలపై ఆరా తీశారు. జ్వరాల నిర్ధారణకు జ్వర పీడితులకు ఆర్టీడీ టెస్టు ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి ఆరుగురికి మలేరియా జ్వరాలు ఉన్నట్టు నిర్ధారించారు. వారికి అవసరమైన మందులు అందచేసినట్టు మలేరియా అధికారి రమణ చెప్పారు. మలేరియా కారక దోమల నిర్మూలనకు ఇంటింటా స్ప్రేయింగ్ చేయించారు. దోమ తెరలు వాడాలని, రోజూ కాచి వడపోసిన వేడి నీటిని తాగాలని ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గిరిజనులకు సూచించినట్టు చోడవరం సబ్ యూనిట్ మలేరియా ఆధికారి రమణ తెలిపారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: పండగల వేళ ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనంగా జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తాత్కాలికంగా జతచేస్తున్నారు. విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం (58506/58505) పాసింజర్‌కు మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను, విశాఖపట్నం–భవానీపట్నం–విశాఖపట్నం (58504/58503) పాసింజర్‌కు మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు

నేటి పాలిసెట్‌కు సర్వం సిద్ధం



జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు

తుమ్మపాల: ఈ నెల 30న జిల్లాలో పాలిసెట్ పరీక్ష–2025 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కో–ఆర్డినేటర్ ఐ.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. జిల్లాలో 23 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షకు మొత్తం 9,022 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రం అనకాపల్లి టౌన్‌లో 14, నర్సీపట్నంలో 9 కేంద్రాలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉదయం 10 గంటలకు మొదలయ్యే పరీక్షకు అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో గంట ముందు చేరుకోవాలన్నారు. బాల్ పాయింట్ పెన్ (బ్లాక్), పెన్సిల్, ఎరేజర్, షార్పనర్ తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు (ట్యాబ్స్, మొబైల్ ఫోన్లు) కాలిక్యులేటర్లు, స్మార్ట్ వాచ్‌లకు అనుమతి లేదన్నారు.

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1100

తుమ్మపాల: ఫిర్యాదులు నమోదు చేయాలనుకుంటున్నా, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవాలనుకుంటున్నా తక్షణమే టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కాల్ సెంటర్ సేవలను అవసరమైనవారు వినియోగించుకోవాలన్నారు. దీని ద్వారా కొత్త సమస్యల నమోదుతో పాటు పెండింగ్ ఫిర్యాదుల స్థితి త్వరగా తెలుసుకోవచ్చునని తెలిపారు.

15 వైద్య శిబిరాల ఏర్పాటు

సీతంపేట (విశాఖ): చందనోత్సవానికి వచ్చే భక్తుల కోసం కొండపైన 8, కొండ దిగువన 7 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వైద్య శిబిరాలకు అనుబంధంగా 16 ఏఎల్ఎస్ అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచినట్టు పేర్కొన్నారు. సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. మెడికవర్, అపోలో, విమ్స్, కేజీహెచ్ ఆసుపత్రులను రిఫరల్ కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మేక కోసం వచ్చి మృత్యువాత

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ
- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు



ట్యాంకర్ ఢీకొట్టడంతో బోల్తా పడ్డ ట్రాక్టర్, పక్కన మృతుడు సత్తిబాబు, (ఇన్‌సెట్) సత్తిబాబు (ఫైల్)

నక్కపల్లి : మేక కోసం వచ్చి ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన మంగళవారం నక్కపల్లి వారపు సంత సమీపంలో జరిగింది. జాతీయరహదారిపై నక్కపల్లి వారపు సంత సమీపంలో ట్రాక్టర్‌ను ట్యాంకర్ లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మరణించగా మరో ముగ్గురు గాయపడ్డారు. సీతంపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో ముగ్గురు కూలీలు అడ్డురోడ్డు వెళ్తున్నారు. వారపు సంత సమీపంలో తుని నుంచి విశాఖ వెళ్తున్న ట్యాంకర్ లారీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి కొద్ది దూరం ఈడ్చుకు పోయింది. ప్రమాదానికి గురైన ట్రాక్టర్ రోడ్డుపక్కన మేకను పట్టుకుని కూర్చొన్న వ్యక్తిపై బోల్తాపడడంతో సారిపల్లిపాలెం గ్రామానికి చెందిన మామిడి సత్తిబాబు(40) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఈ ప్రమాదంలో సీతంపాలెం గ్రామానికి చెందిన ప్రసాదుల భాస్కరరావు, మేకల నాగేంద్ర, మడగా శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం విశాఖపట్నం తరలించారు.

సారిపల్లిపాలెంలో విషాదం

సారిపల్లిపాలెం గ్రామానికి చెందిన సత్తిబాబు మేకలను మేపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే జాతీయరహదారి పక్కన ఉన్న పొలాల్లోకి మేకలను మేపుకోడానికి వచ్చాడు. మేకల మందలో ఒక మేక తప్పిపోయి జాతీయ రహదారి సమీపానికి రావడంతో అక్కడకు వచ్చిన సత్తిబాబు మేకను పట్టుకుని ఎండ వేడిమి తట్టుకోలేక రోడ్డుపక్కన చెట్టు నీడన కూర్చుని సేదతీరుతున్నాడు. ఇంతలో రోడ్డుపై వెళుతున్న ట్రాక్టర్‌ను ట్యాంకర్ లారీ ఢీకొనడం, అది సత్తిబాబుపై పడడంతో ట్రాక్టర్ కిందపడి సత్తిబాబు మృత్యువాత పడ్డాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యజమానిని కోల్పోవడంతో కుటుంబం రోడ్డున పాలైంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కుమార స్వామి తెలిపారు. బాధిత కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తాతబాబు పరామర్శించారు.

5వ తేదీ నుంచి సీపీఐ జిల్లా మహాసభలు



వేచలపు కాసుబాబు

కె.కోటపాడు : వచ్చే నెల 5, 6, 7 తేదీలలో అనకాపల్లి జిల్లా యలమంచిలిలో సీపీఐ జిల్లా 2వ మహాసభలు జరగనున్నట్లు ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు తెలిపారు. కె.కోటపాడులో మంగళవారం ఆయన విలేకరులకు తెలిపారు. ఈ సమావేశాలకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి హాజరవుతారన్నారు. అనకాపల్లి జిల్లాలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటామని ఎన్నికల ప్రచార సమయంలో రైతులకు కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అయితే ఈ ఏడాది క్రషింగ్ కూడా సక్రమంగా జరిగే పరిస్థితి ఫ్యాక్టరీలో లేకపోయిందని కాసుబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది అవుతున్నా గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. సీపీఐ మహాసభలో గోవాడ సుగర్స్ అంశాన్ని చర్చిస్తామన్నారు. జిల్లా మహాసభలకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాసుబాబు కోరారు.

గుండె గు‘బిల్లు’

- కొనసాగుతున్న కరెంటు బిల్లుల దందా
- కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం



కరెంటు బిల్లులు చూపిస్తున్న దళితులు, సీపీఎం నాయకులు



బాలయ్య వాడిన 145 యూనిట్లకు 9వేలు దాటిన బిల్లు



అప్పారావు వాడిన 66 యూనిట్లకు వచ్చిన బిల్లు

నక్కపల్లి: ఎస్సీ, ఎస్టీలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన విద్యుత్ రాయితీని తుంగలోకి తొక్కడమే కాక వేలాది రూపాయల బకాయిలు కూడా చెల్లించమని కూటమి సర్కారు ఒత్తిడి చేయడం పట్ల తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తమవుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నెలకు 200 యూనిట్ల వరకు మినహాయింపు ఇచ్చి ఉచితంగా విద్యుత్ అందించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు వేలల్లో కరెంటు బిల్లులు వస్తున్నాయి. తామూ ఉచిత కరెంటు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు 200 యూనిట్ల రాయితీని అమలు చేయకపోవడమే కాక పాత బకాయిలు ఉన్నాయంటూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. డొంకాడలో ఏప్రిల్ నెలలో 100 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించిన దళితులకు ట్రాన్స్‌కో వారు ఇచ్చిన బిల్లులు షాక్ కొట్టాయి. మే నెలలో చెల్లించాలని, కాని పక్షంలో కనెక్షన్ తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారని దళితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ ఎం.రాజేష్‌లు డొంకాడ దళిత కాలనీకి వెళ్లి బిల్లులు పరిశీలించారు. సర్వీసు నెంబరు 478లో నిమ్మల బాలయ్య 145 యూనిట్లు వాడితే రూ.9,324 బిల్లు ఇచ్చారు. సర్వీసు నెంబరు 196తో డి.పెద అప్పారావు 66 యూనిట్లు వాడితే రూ.1571లు చెల్లించాలని బిల్లు వచ్చింది. సర్వీసు నెంబరు 617తో రాములమ్మ 75 యూనిట్లు వాడితే రూ.1086లు చెల్లించాలని బిల్లు చేతికిచ్చారు. ఈ బిల్లులపై అప్పలరాజుతోపాటు వినియోగదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా కరెంటు బిల్లులు కట్టలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీలపై బకాయిల భారం మోపకుండా చూడాలని, 200 యూనిట్ల వరకు ఉచిత పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.


లేటరైట్ పేరుతో బాక్సైట్ దోపిడీ



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొట్టా నాగరాజు

నర్సీపట్నం : నాతవరం మండలం, సుందరకోట ప్రాంతంలో లేటరైట్ పేరుతో బాక్సైట్ దోపిడీకి పాల్పడుతున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొట్టా నాగరాజు పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి తవ్వకాలు ప్రారంభించారన్నారు. లేటరైట్ తవ్వకాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అక్రమ మైనింగ్ వల్ల వారి జీవన మనుగడకే ప్రమాదం ఉందన్నారు. కొంత మంది దళారులు, రాజకీయ నాయకులు సహాయంతో అక్రమ మైనింగ్ జరుగుతుందన్నారు. గతంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు లేటరైట్ ముసుగులో బాక్సైట్ తవ్వకుపోతున్నారని ఆందోళన చేశారని గుర్తు చేశారు. గతంలో బాక్సైట్ అయినప్పుడు ఇప్పుడు లేటరైట్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. తక్షణమే అక్రమ మైనింగ్‌ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

సారాబట్టీలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు



డ్రమ్ములలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లం పులుపును స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ శేఖరం

కె.కోటపాడు : కొత్త భూమి గ్రామంలో సారా తయారీ కేంద్రాలపై చోడవరం ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి ఎస్‌ఐ శేఖరం గ్రామం శివార్లలో తనిఖీలు జరిపారు. గ్రామ శివార్లలో గల సరుగుడు తోటలో డ్రమ్ములతో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 600 లీటర్ల బెల్లం పులుపును గుర్తించి ధ్వంసం చేశారు. వీటితో పాటు 30 లీటర్ల సారాతో పాటు దమ్ము దేముడు అనే వ్యక్తిని పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి జైలుకు పంపినట్టు ఎస్‌ఐ తెలిపారు. సారా కేసుల్లో ఒకటి కంటే ఎక్కువ మార్లు పట్టుబడితే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది రాంబాబు, కె.వి.నాయుడు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని ధర్మవరం వీధికి చెందిన తన కుమారుడు తంగిళ్ల లోవరాజు(37) రెండ్రోజులుగా కనిపించడం లేదని తల్లి కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి తెలిపారు. తనకు, కోడలికి అప్పుడప్పుడూ గొడవలు జరుగుతూ ఉంటాయని, గొడవ జరిగినపుడు తన కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చేస్తుంటాడని, కానీ ఈసారి ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు రెండ్రోజులు గడుస్తున్నా ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చుట్టుపక్కల వెతికినా తన కుమారుడి ఆచూకీ దొరకలేదన్నారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆయుష్మాన్ సీహెచ్‌వోల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సీహెచ్‌వోలు

తుమ్మపాల : అనేక సమస్యలతో సతమతమవుతున్న తమకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పందించాలంటు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల సీహెచ్‌వోలు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సమస్యల పరిష్కారంపై డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. ప్రతి ఏటా 5 శాతం ఇంక్రిమెంట్, పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరణ, ఈపీఎఫ్‌వో పునరుద్ధరణ, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌వోలను మినహాయించాలన్నారు.హెచ్ఆర్ పాలసీ వెంటనే అమలు చేయాలన్నారు. రెండేళ్ల నుంచి ఉన్న జీతభత్యాల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ప్రధానోపాధ్యాయుడిపై కేసు నమోదు

యలమంచిలి రూరల్ : ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను చర్చికి తీసుకొచ్చిన యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లి మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.బాల ప్రభుకుమార్ (బాలు)పై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి మంగళవారం రాత్రి తెలిపారు. ఇక్కడ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను వేసవి ప్రత్యేక తరగతులు చెబుతామని చెప్పి పెదపల్లి నుంచి వ్యాన్‌లో యలమంచిలి గాంధీనగరంలో ఉన్న రెహబోత్ చర్చికి తీసుకొచ్చి అక్కడ జరుగుతున్న చర్చి కార్యకలాపాల్లో పాల్గొనేలా చేసినట్టు విద్యార్థుల తల్లిదండ్రులు నాగ గణేష్ సహా కొంతమంది తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు పెదపల్లి నుంచి యలమంచిలి పట్టణంలో ఉన్న చర్చికి తీసుకురావడం పట్ల స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం చర్చి వద్దకు వచ్చి దీనిపై ప్రధానోపాధ్యాయుడ్ని నిలదీశారు. ఉద్రిక్త పరిస్థితి ఏర్పడడంతో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని ఇందుకు బాధ్యులైన వారిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

పన్ను చెల్లింపునకు నేడు తుది గడువు



జోనల్ కార్యాలయంలో పన్నులు చెల్లించే సౌకర్య కేంద్రం

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో ఆస్తి పన్ను ఏకమొత్తంలో చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇస్తోంది. ఈ అవకాశం బుధవారంతో ముగియనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే రాయితీ, పాత బకాయిలపై వడ్డీ రాయితీ అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జోనల్ కమిషనర్ బీవీ రమణ మంగళవారం తెలిపారు.

వివాహిత అదృశ్యం

అనకాపల్లి టౌన్: మండలంలోని మూలపేటకు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో భర్త ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయం ముస్తాబు



విద్యుద్దీపాలతో స్వామివారి ఆలయం

కశింకోట: చందనోత్సవం పురస్కరించుకొని స్థానిక వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. వైశాఖ మాసం అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం చందనోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా స్వామివారికి పూసిన చందనాన్ని వేద మంత్రాల నడుమ తొలగించి నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయంలో చందనోత్సవ నిర్వహణకు సన్నాహాలు చేశారు.

'కోరిన చోట మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలి'

అనకాపల్లి: పట్టణంలో అనకాపల్లి-విశాఖ వెళ్లే మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు ప్రయాణికులు కోరిన చోట ఆపకుండా వెళ్లిపోవడంతో ఆటోలో వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై ప్రజారవాణా శాఖ అధికారులకు అనేక సార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ సరైన స్పందన లేకుండా పోయిందన్నారు. తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అనకాపల్లి నుంచి విశాఖ నగరానికి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. బస్సు సమయాన్ని పాటించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 1,074 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
మొదటి రకం	3,900	4,650
రెండో రకం	3,740	4,280
మూడో రకం	3,250	3,730

అనకాపల్లి సినిమాలు

రాజా : జింఖానా
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : సారంగపాణి జాతకం
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : పాతం
శ్రీసత్య : భరత్ అనే నేను
రామచంద్ర : తుడరుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-11, ఓ పాజిటివ్-30, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



గుర్రపు డెక్క, తూటికాడతో నిండిపోయిన శంకరం వద్ద పులికాలువ

చెరువంత నిర్లక్ష్యం

- చుక్కనీరు నిల్వ ఉండక ఇబ్బందులు
- పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటికాడ
- కాలువల నిర్వహణలో అదే తీరు
- పూడిక తీయక ఏటా రైతుల పాట్లు

తుమ్మపాల: పంటలు సమృద్ధిగా పండాలంటే పుష్కలంగా నీరు కావాలి. ఆ నీరే నిల్వ ఉండకుండా పోవడంతో ఇక పంటలు ఎలా పండుతాయి? చెరువులతోపాటు సాగునీటి కాలువలను కూటమి పాలకులు పూర్తిగా విస్మరించారు. వేసవిలో వీటి అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడంతో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటికాడతోపాటు షట్టర్లు మరమ్మతులకు గురి కావడంతో వచ్చే ఖరీఫ్ కాలంలో సాగునీటి ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే సాగునీటి సంఘాలు..

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అడ్డదారిలో హడావుడిగా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి వారిని ప్రేక్షక పాత్రకే పరిమితం చేసింది. పల్లెల్లో చెరువులు, కాలువల్లో పూడిక తీయకుండా సమావేశాలతో సరిపెడుతోంది. గతేడాది కురిసిన వర్షాలకు కాలువల్లో పూడిక కారణంగా పొలాల్లోనే నీరు నిలిచిపోయి మండలంలో కొన్ని గ్రామాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. వేసవి నాటికి పూడిక తీసి కాలువల్లో ఆక్రమణలు తొలగిస్తామని, వీటి నిర్వహణపై కమిటీ పూర్తి బాధ్యత తీసుకుంటుందని చేసిన ప్రకటనలు నేటికి అమలు కాలేదు. దీంతో గ్రామాల్లో కమిటీల పేరుతో నియమించిన సాగునీటి సంఘాల అధ్యక్ష, సభ్యులు రైతుల వద్ద తలెత్తుకోలేకపోతున్నారు.

ప్రతిపాదనలతో సరి.. పనులెప్పుడో మరి!

మండలంలో 130కి పైగా చెరువులు, కాలువలు చానళ్ల షట్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఏటా నీరు చెరువుల్లో నిల్వ ఉండటం లేదు. కాలువలు, చానళ్ల షట్టర్లు పాడవడంతో పొలాలకు నీరు చేరి ముంపునకు గురవుతున్నాయి. వీటి మరమ్మతులకు నీటి పారుదల శాఖ అధికారులు అంచనా వ్యయంగా రూ.424.50 లక్షలు, గ్రోయిన్స్ మరమ్మతులకు రూ.431.50 లక్షలతో నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి గత ఏడాదిలోనే పంపించారు. కాని నేటికీ కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో ఈ ఏడాది కాలువల నిర్వహణ లేనట్టేనని రైతులు వాపోతున్నారు. మే నెల వస్తున్నా పనులు ప్రారంభం కాలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెరువుల్లో కనుమరుగైన ఇనుప గేట్లు

ఏటా వర్షా కాలంలో పంటల మునక

గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు మండలంలో కొండుపాలెం నుంచి శంకరం వైపు వచ్చే ఎదురు గెడ్డ పొంగటంతో పెద్ద ఎత్తున పొలాలు నీట మునిగి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. కొద్దిపాటి వర్షానికే కాలువలు పొంగి పొలాలను ముంచెత్తుతున్నాయి. మండలంలో సాగునీటి కాలువలన్నీ పూడికతీయక పోవడం వల్ల అధ్వానంగా మారాయి. శారదా నది వద్ద గ్రోయిన్లు దారుణంగా ఉన్నాయి. గురపుడెక్క, నాచు, తూడు దట్టంగా పేరుకుపోయి వర్షపు, ఏటి కాలువ నీరు సక్రమంగా దిగువకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాదైనా పనులు చేపట్టకపోతే, రైతులు తీవ్ర ఇబ్బంది పడతారని, ఖరీఫ్ లోగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఒక్కో గ్రామంలో రెండు మూడు చెరువులు ఉండగా, కనీసం ఒక్కటైనా అభివృద్ధి చేసిన పాపాన పోలేదు.

మండలంలో సాగునీటి (ఏటి కాలువ) కాలువలతోపాటు మామిడిపాలెం, బవులువాడ, ఊడేరు, మార్టూరు, కొండుపాలెం, పాపయ్యపాలెం, సంతపాలెం, చేనుల అగ్రహారం, చింతనిప్పుల అగ్రహారం, కోడూరు, గొల్లపేట, భూపతిపాలెం, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, గొలగాం, రేబాక, బట్లపూడి, కూండ్రం, కుంచంగి, వేంగాలపాలెం వంటి గ్రామాలు ప్రధానంగా చెరువుల పైనే ఆధారపడి ఆయకట్టు భూముల్లో వరి పండిస్తున్నారు. 15 ఏళ్లుగా చెరువులు, కాలువల నిర్వహణ సరిగ్గా లేక పూడిక తీయక అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని గ్రామాల్లో చెరువుల మదుముల వద్ద ఇనుప గేట్లు తుప్పు పట్టి పూర్తిగా పాడయ్యాయి. చెరువుల్లో నీరు వృథాగా పోవడంతో రైతులు సమష్టిగా మదుములను మూసివేయడంతో పంటలకు నీరు అవసరమైనప్పుడు తీసుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మదుముల వద్ద ఇనుప గేట్లు వేసి చెరువుల్లో నీరు వృథా కాకుండా చూడాలని వాటిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

శివారు భూములకు నీరందడం లేదు



సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పంట కాలువల్లో గుర్రపు డెక్క, తూటికాడ పేరుకుపోయి అధ్వానంగా మారాయి. ఏళ్ల తరబడి పూడిక తీతలు లేవు. కాలువలు, చెరువుల ఆధారంగా ఉన్న ఆయకట్టు శివారు భూములకు నీరందడం లేదు. దీంతో పంట సాగు చేయలేక ఖాళీగా వదిలేస్తున్నాం. ఖరీఫ్ నాటికి కాలువల్లో పూడిక తీస్తే, పొలాలు ముంపునకు గురవ్వకుండా ఉంటాయి.

– నాగేష్, రైతు చింతనిప్పుల అగ్రహారం

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో మరమ్మతులకు గురైన అన్ని చెరువులు, కాలువల షట్టర్లు బాగుచేయడానికి నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించాం. శారదా నది వద్ద గ్రోయిన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు కోసం ఎదురు చూస్తున్నాం. ఈ లోపు ఆవ ఖండం వైపు పులికాలువలో పూడిక తీసేందుకు కలెక్టర్ నిధులు మంజూరు చేయనున్నారు. ఆ మేరకు ఇటీవల ల్యాండ్ సర్వే చేపట్టాం. త్వరలో పులికాలువ పూడిక పనులు ప్రారంభిస్తాం.

– అమూల్య, ఇరిగేషన్ ఏఈ అనకాపల్లి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా నరసింగబిల్లి, జె.తుని, ఎన్.జి. పాలెం, త్రిపురవానిపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఎ.ఎస్. పేట, సోమవరం, ఏనుగుతుని, చిన ఏనుగుతుని, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. తాళ్లపాలెం పరిధిలోని వ్యవసాయ రంగానికి ఉదయం 4 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

అనకాపల్లి: విద్యుత్ శాఖ డి-1 సెక్షన్ పరిధిలో తీగల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం గురువారం సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ టౌన్-2 ఫీడర్ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, శారదాకాలనీ, నెహ్రూచౌక్, ఎల్ఐసీ కార్యాలయం రహదారి, ఉమ్మలాడ ఏరియా పాత బర్మాకాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

ఐదుగురికి తీవ్ర గాయాలు

నక్కపల్లి: జాతీయ రహదారిపై ఉద్దండపురం జంక్షన్‌లో మంగళవారం రాత్రి ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అడ్డురోడ్డు నుంచి తుని వైపు వెళ్తున్న ఆటో ఉద్దండపురం జంక్షన్‌లో ప్రయాణికులను దించుతుండగా విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏటికొప్పాకకు చెందిన చట్టబాజి సత్తిబాబు, పాయకరావుపేట మండలం రాజవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఏడిద అప్పన్న, ఉద్దండపురానికి చెందిన గాద ధనలక్ష్మి, కనక రంగలక్ష్మి, పాయకరావుపేటకు చెందిన వర్ల వెంకటరమణలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రమాదానికి కారణమైన బస్సు ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు వెంబడించి పాయకరావుపేటలో పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు



తాళ్లు తెగి కిందపడిన ఫ్లెక్సీ బోర్డు

అనకాపల్లి టౌన్: పట్టణంలో నాయకుల పుట్టిన రోజులు, స్వాగతాల కోసం ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మరాయి. తాజాగా ఎన్టీఆర్ గ్రౌండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డుకు కట్టిన తాడి తెగి వాహనదారుడిపై పడింది. అయితే త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. గాలులు వీచినప్పుడు, బోర్డులకు కట్టిన తాడులు తెగిపోవడం ప్రయాణికులపై పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

హెచ్‌పీసీఎల్ మెరిట్ స్కాలర్‌షిప్‌లు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు విశాఖలోని హెచ్‌పీసీఎల్ సీఎస్సార్ నిధులతో మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మంగళవారం తెలిపారు. కళాశాలలో 281 మంది విద్యార్థులకు రూ.24.06 లక్షలు అందించినట్లు పేర్కొన్నారు. హెచ్‌పిసిఎల్ ఈడీ రామనాథన్ రామకృష్ణతో పాటు సీనియర్ జనరల్ మేనేజర్ కిరణ్ కుమార్, హెచ్‌ఆర్ కె.నగేష్‌లకు కళాశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది కూడా సహకరించాలని కోరారు.

బాల్య వివాహాల నివారణే లక్ష్యం

కశింకోట: బాల్య వివాహాల నివారణ కోసం కిశోర బాలికలకు వేసవిలో అవగాహన కలిగించాలని సీడీపీవో పి. ప్రభావతి కోరారు. కశింకోటలో అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోర వికాస్ బాల బాలికలకు వేసవిలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, డ్వాక్రా వీవో, మహిళా పోలీసులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి 11 నుంచి 18 ఏళ్ల వయస్సు మధ్య కలిగిన బాల బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. వారు బయట ఉండకుండా స్కూళ్లలో చేరి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ రాము

కశింకోట: చింతలపాలెంలో పూర్తిస్థాయిలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని సర్పంచ్ కొట్టె రాము తెలిపారు. కొత్తగా బోరు తవ్వించడానికి మంగళవారం ఆయన భూమి పూజ నిర్వహించారు. జల జీవన్ మిషన్ కింద రూ.37 లక్షలతో తాగునీటిని అందించాలని సంకల్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బోరు ఏర్పాటు చేసి రెండో రక్షిత నీటి పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చి వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. ఉప సర్పంచ్ బల్లా అప్పలకొండ, స్థానిక నాయకులు సియాద్రి రాజు, పులిమంతుల గణేష్, ఈగల భాస్కర్ పాల్గొన్నారు.

3వ తేదీన జాబ్ మేళా

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్‌లో ట్రైనీ సూపర్‌వైజర్స్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఉద్యోగాలకు మే 3వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. బీఎస్సీ, ఎంఎస్సీ (కెమిస్ట్రీ) 2021-24లో ఉత్తీర్ణులైన వారు. ప్రస్తుతం డిగ్రీ, పీజీ ఆఖరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. 21 నుంచి 25 వయస్సు కలిగి ఉండాలని, తగిన ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

దేవీపురంలో సంస్కృత భాష అభ్యాసకులు



శ్రీచక్ర ఆలయం వద్ద శోభాయాత్రగా వచ్చిన సంస్కృత అభ్యాసకులు

సబ్బవరం: వేసవి శిబిరం- సంస్కృత సప్తాహం కోసం పలు రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యాసకులు మంగవారం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవిని దర్శించుకున్నారు. సంస్కృత భాషను అట్టడుగు ప్రజలకు అందించాలనే సంకల్పంతో దేశ విదేశాల్లో కృషి చేస్తున్న సంస్కృత భారతి స్వచ్ఛంద సంస్థ ఈ శిబిరాన్ని అనకాపల్లి జిల్లా కోడూరులో ఏర్పాటు చేసింది. శిబిరంలో శిక్షణ పొందుతున్న వీరంతా కోడూరు నుంచి దేవీపురం వరకూ శోభాయాత్రగా తరలి వచ్చి, దేవిని దర్శించుకున్నారు.

విజ్ఞాన వికాసానికి గ్రంథాలయాలు



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్ భాస్కరరావు

తివిజ్ఞాన వికాసానికి నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవాలని దిబ్బపాలెం స్కూల్ అసిస్టెంట్ ఏవీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు సులువుగా ఇంగ్లిష్ మాట్లాడంలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్కృతి ఇంగ్లిషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ జి. సత్యకుమార్, ఉపాధ్యాయిని నీలిమ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సిటిజన్ భాస్కరరావు కోరారు. మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో రెండో రోజు మంగళవారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో శిక్షణ కార్యక్రమంలో కొత్త విషయాలను నేర్చుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి కె. జగన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నల్ల రాయి లోడ్ లారీ సీజ్

అనకాపల్లి టౌన్: నిబంధనలు అతిక్రమించిన క్వారీలపై కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి హెచ్చరించారు. మండలంలోని వేట జంగాలపాలెంలో నల్ల రాయి క్వారీని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. నల్లరాయి లోడ్‌తో వెళ్తున్న లారీ(ఏపీ07టీఎం 0651)ని గుర్తించి విచారించగా గ్రామంలో లైసెన్స్ గడువు ముగిసి ఆగిపోయిన క్వారీకి తీసుకెళ్తున్నట్లుగా నిర్ధారించారు. ఈ క్రమంలో మైనింగ్ అధికారులు, వీఆర్వోలు సమక్షంలో పంచానామా చేసి లారీని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో తవ్విన ప్రాంతాన్ని సర్వే చేసి ఆ మేరకు జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలని మైన్స్ ఆర్ఐ బి. శ్రీనివాస్‌ను కోరారు. కార్యక్రమంలో రూరల్ సీఐ జి. అశోక్ కుమార్, ఎస్ఐ జి. రవికుమార్ పాల్గొన్నారు.



వేట జంగాలపాలెంలో నల్ల రాయి క్వారీని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

'తాడి' తరలింపుపై చురుగ్గా సర్వే

పరవాడ: అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు తాడి గ్రామ తరలింపు కోసం పునరావాస సర్వే చురుగ్గా సాగుతోందని మండల సర్వేయర్ శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజులుగా గ్రామంలో జరుగుతున్న సర్వేను మంగళవారం పరిశీలించి, సర్వే బృందానికి తగు సలహాలు, సూచనలు అందించారు. సర్వేలో ఎలాంటి లోపాలకు తావీయరాదన్నారు. సర్వే బృందానికి అవసరమైన ఆధారాలను అందించి, సహకరించాల్సిందిగా ప్రజలను కోరారు.



ఇంటింటి సర్వేలో మండల రెవెన్యూ అధికారులు